క్లుప్తంగా

రేపు పెన్షనర్స్ డే

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బీటీ.నరసింహులు, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి నరసింహులు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పెన్షనర్స్ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శబరిమలకు పాదయాత్ర



శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్పమాలధారులు

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి శబరిమలకు వెంకటరమణ (కరెంటు)స్వామి, ఆనంద్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పమాలాధారులు మహాపాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. స్థానిక చేనేతనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకుని బయలుదేరారు. డిసెంబర్ 31న శబరిమల చేరుకుంటామని వెంకటరమణస్వామి తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై సందడి



అటవీసముదాయంలో పర్యాటకులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం సందడి నెలకొంది. వాతావరణం చల్లగా మారిపోవడం, మేఘాలు కొండను కమ్మేయడంతో సందర్శకులు ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆసక్తి చూపారు. దీంతో కొండపై గాలిబండ, పర్యావరణ సముదాయం, వ్యూపాయింట్ల వద్ద సందర్శకుల రద్దీ కనిపించింది.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పి.వి. రమణారెడ్డి

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి. రమణారెడ్డి, వై. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక షఫీ కల్యాణమండపంలో ఎన్‌ఎంయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ గౌరవాధ్యక్షుడిగా ఎల్లెల రెడ్డెప్ప రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 1/2019 జీఓ నంబర్ పునరుద్ధరించాలని, ఉద్యోగుల పీఆర్‌సీకి కమిటీ వేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలు, లీవు ఎన్‌క్యాష్‌మెంట్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, ఎన్‌ఎంయూ తిపపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాల్, ఎం.ఎస్. బాబు, వేలు, భాస్కర్, ఎం.ఎస్. రావు, పీఎస్‌ఎం రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

కలికిరి(వాల్మీకిపురం): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మణికంఠ స్వామివారికి పాలాభిషేకం, పుష్ప అలంకరణ చేశారు. అయ్యప్ప నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. సాయంకాలం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆదినారాయణస్వామి జయంతి



పూజలందుకున్న ఆదినారాయణ స్వామి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువు కట్టపై ఆదివారం శ్రీ అవధూత ఆదినారాయణ స్వామి 98వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో కట్టపై వెలసిన గంగమ్మ ఆలయం వద్ద గంగపూజ, గోపూజ, గురుపూజా కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించామని నిర్వాహకులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

మదనపల్లె సిటీ: స్థానిక గాంధీపురానికి చెందిన దివ్యాంగురాలు కృష్ణవేణికి ఆదివారం హెల్పింగ్‌మైండ్ సంస్థ సభ్యులు ట్రైసైకిల్ అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు సనిల్, కిరణ్, శివకుమార్, పురుషోత్తం, దినకర్ పాల్గొన్నారు.

స్థలాలు కరువు.. నిర్మాణాలు బరువు

- కబ్జా కోరల్లో వక్ఫ్‌బోర్డు భూములు
- మైనార్టీ ఐటీఐకి రూ. 10 కోట్లు మంజూరు
- స్థలం కోసం అన్వేషణ
- శిలాఫలకానికే పరిమితమైన షాదీమహల్



ఐటీఐ కళాశాల కోసం స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

గుర్రంకొండ: 'అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడు నోట్లో శని' అన్న చందంగా గుర్రంకొండ ముస్లింల పరిస్థితి ఉంది. గుర్రంకొండలో వందల ఎకరాలు వక్ఫ్‌బోర్డు భూములున్నా ముస్లింలకు సంబధించిన భవన నిర్మాణాలకు, షాదీమహల్ నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడింది. జిల్లాలోనే గుర్రంకొండలో మొదటిసారిగా మైనార్టీ ఐటీఐ మంజూరు అయింది. ఇందు కోసం అప్పట్లో ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. కళాశాలను 10 ఎకరాల్లో నిర్మించాలని అధికారులు నిర్ణయం కూడా తీసుకున్నారు. అప్పట్లో జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. గ్రామంలో వందలాది ఎకరాల వక్ఫ్ భూములున్నా పట్టుమని 10 ఎకరాల స్థలం లభించలేదు. దీంతో చేసేదిలేక రెవెన్యూ అధికారులు చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలోని గుట్టల్లో 5.06 ఎకరాల స్థలాన్ని సర్వేచేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఏండ్లు గడుస్తున్నా ఐటీఐ నిర్మాణం కోసం స్థల అన్వేషణలోనే అధికారులు ఉండడం గమనార్హం.

షాదీమహల్ నిర్మాణం ఎప్పుడు?

1999లో షాదీమహల్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పట్లో షాదీమహల్ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి రూ. 5లక్షలు నిధులు మంజూరు చేశారు. గ్రామంలోని వక్ఫ్‌బోర్డు స్థలంలో ఐదు సెంట్ల స్థలం కూడా కేటాయించారు. అనివార్య కారణాలతో నిర్మాణం జరగలేదు. 2004లో మళ్లీ షాదీమహల్ మంజూరయ్యింది. రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. స్థలం ఎంపిక సమస్యగా మారడంతో నిలిచిపోయింది. 2011లో మరోసారి షాదీమహల్ నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఏండ్లు గడుస్తున్నా శిలాఫలకానికే పరిమితమైందే తప్పా పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మళ్లీ 2013లో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి షాదీమహల్ మంజూరు చేసి నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే ఏడాది మేనెల 27న నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మూడు సార్లు నిధులు మంజూరయ్యాయి. నిధులు వినియోగించకపోవడంతో ఆ నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

రూ.300 కోట్ల భూములు కబ్జా

గుర్రంకొండతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.300 కోట్లు విలువచేసే వక్ఫ్‌బోర్డు భూములు కబ్జాకు గురయ్యాయి. ఒక్క గుర్రంకొండ పట్టణంలోనే రూ. 200 కోట్లు విలువచేసే వక్ఫ్‌బోర్డు స్థలాలను కబ్జా చేశారు. కడప–బెంగుళూరు జాతీయ రహదారికి ఇరువైపులా పట్టణంలో విలువైన వక్ఫ్‌బోర్డు స్థలాలు ఉన్నాయి. పట్టణంలో అధిక శాతం ముస్లింలు నివసిస్తున్నారు. అయితే వీరికి ఏమాత్రం వక్ఫ్‌బోర్డు స్థలాలు ఉపయోగపడడంలేదు. కొంతమంది కబ్జాకోరులు ఇష్టానుసారం వీటిని ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



గుర్రంకొండలో షాదీమహల్, మైనార్టీ ఐటీఐ నిర్మాణాలకు అవసరమైన స్థలాల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతాం. రెవెన్యూ అధికారుల సాయంతో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – వసీమ్ అక్రమ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, అన్నమయ్య జిల్లా

ముస్లింల హక్కులు కాలరాస్తున్న కేంద్రం



బహిరంగసభలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ జమియత్ ఉల్మా ఏ హింద్ జాతీయ అధ్యక్షుడు హజరత్ అర్షద్ మదనీసాహెబ్ ఆధ్వర్యంలో కడపలో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ–జాతీయ ఐక్యత బహిరంగసభకు మదనపల్లె నియోజకవర్గం నుంచి ముస్లింలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఇస్లామిక్ చట్టం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందన్నారు. ముస్లిం సమాజానికి నష్టం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్ సీపీ మొదటి నుంచి వ్యతిరేకిస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సవరణలు తీసుకోస్తోందని విమర్శించారు. ముస్లిం సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు సీఏఏ, ఎన్ఆర్‌సీ, వక్ఫ్ సవరణలు వంటి చట్టాలు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

రామసముద్రం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం రామసముద్రం మండల కేంద్రంలోని మోడరన్ పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఉషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికలతో మెలగాలని, రాబోయే రోజుల్లో మంచి విద్యను అభ్యసించి మండలానికి, జిల్లాకి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వేణు, ఉష, పీసీ సురేంద్రయాదవ్, బాలాజీ, అవినాష్, నారాయణస్వామి, వాలెప్ప, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న థిల్లానా మెగా ఫెస్ట్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం థిల్లానా మెగా ఫెస్ట్ టాలెంట్–2024 నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు డ్యాన్స్, సింగింగ్, పెయింటింగ్, మెహందీ, రంగోలి, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వెలిగల్లు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పెద్దమండ్యం: మండలంలోని వెలిగల్లు ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి హిందీ ఉపాధ్యాయుడు సాహెబ్ పీర్‌ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి, హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు బోధనతో ఉన్నత చదువులు చదివి పై స్థాయికి వెళ్లినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు జ్యోతి, మాధవి, సుజాత, సుధాకరరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రామచంద్రారెడ్డి, సాంబశివ, లక్ష్మీపతి, షబ్బీర్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



శ్రీరెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయానికి సమీపంలోని దిగువ తొట్లివారిపల్లెలో అర్చకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హిందువులతో పాటు ముస్లింలు అమ్మవారిని దర్శించుకొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన పంట



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

పీలేరు రూరల్ : సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ సుధారాణి అన్నారు. ఆదివారం మండలంలోని ముడుపుల వేముల పంచాయతీ కుమ్మరపల్లెలో 1,200 లీటర్లు ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. సేంద్రియ పద్ధతితో పంటలు సాగు చేయడం ద్వారా నాణ్యమైన పంటతో పాటు ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. రైతులు సేంద్రియ విధానాలు పాటించి భూమిని, ప్రకృతిని కాపాడాలని సూచించారు. సిబ్బంది అనిత, సునీత, జానకమ్మ, రైతులు పాల్గొన్నారు.

'మినీ కలం' ఆవిష్కరణ



మినీ కలం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్నమరసం సభ్యులు

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత మంజు ప్రీతం రచించిన మినీ కలం కవితా సంపుటిని ఆదివారం స్థానిక మదనపల్లె రచయితల సంఘం (మరసం) కార్యాలయంలో ఆవిష్కరించారు. రచయిత మంజు ప్రీతం మాట్లాడుతూ తెలుగుభాష, సమాజం, సమస్యలు, ప్రేమానురాగాలపై ఈ పుస్తకం రచించినట్లు తెలిపారు. లక్షల కోసం కాకుండా అక్షరాల కోసం ప్రాకులాడే కవులు అరుదుగా ఉన్నారని తెలిపారు. మరసం అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ యువ రచయిత మంజుప్రీతం మినీ కలం కవితల పుస్తకంలో తన అనుభవాలతో రాయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో జీఆర్‌టీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి, రచయితలు ప్రభాకరశాస్త్రి, నాగరాజు, మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

మదనపల్లె సిటీ: రెక్కాడితే డొక్కాడని కుటుంబం. ఆకస్మాత్తుగా ఇంటి యజమానికి పెద్ద జబ్బు చేసింది. దీంతో ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. తన భర్తను ఆదుకోవాలని భార్య వేడుకుంటోంది. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డుకు చెందిన జమీర్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రేష్మా గృహిణి. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడు. ఏడాదిన్నర క్రితం జమీర్‌కు అనారోగ్యం కారణంగా తిరుపతి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేసుకున్నారు. పైల్స్ ఉన్నాయంటూ వైద్యులు చెప్పడంతో పలు చోట్ల చికిత్సలు చేసుకున్నారు. అయినప్పటికి జబ్బు తగ్గలేదు. మరోసారి తిరుపతిలో వైద్యులు పరీక్షలు నిర్వహించి రెక్టాల్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. అప్పులు చేసి హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రేడియో థెరఫీ చికిత్స చేసుకున్నాడు. అయితే ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆదివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేష్మా మాట్లాడుతూ తమను ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని వేడుకుంది.

డిప్యూటీ సీఎం హామీ నిలబెట్టుకోవాలి

బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వ ఏర్పడగానే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.కోటి జమ చేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోటలో జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా సంక్షేమ బోర్డు పునరుద్ధరణ జరగలేదని, కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. రామాంజనేయులు, ఆదినారాయణ,రమణ, ప్రభాకర్, పాపన్న, రామాంజి పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె సిటీ: దివ్యాంగులను ఆదరించాలని వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో మదనపల్లె డివిజన్ చెవిటి, మూగ సంఘం 25వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు హక్కులు ఉన్నాయని, వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు శివకుమార్, అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



కాబోయే వధూవరులతో మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు

కలికిరి (వాల్మీకిపురం): పలు నిశ్చితార్థ కార్యక్రమాల్లో ఆదివారం పాల్గొన్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. గుర్రంకొండ మండలం టి.రాచపల్లి పంచాయతీ బురుజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబుల్‌రెడ్డి కుమారుడు కార్తీక్‌కుమార్‌రెడ్డి నిశ్చితార్థ కార్యక్రమం రాయచోటిలోని పీడీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. వాల్మీకిపురం పట్టణ పరిధిలోని టీడీపీ కళ్యాణమండపంలో జరిగిన పచ్చిపాలచంద్రశేఖర్ ఆచారి కుమార్తె నిశ్చితార్థం, ఆర్‌ఎంఎం కళ్యాణ మండపంలో జరిగిన చింతపర్తికి చెందిన వెంకటరమణారెడ్డి కుమార్తు మనస్వినిరెడ్డి నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, నాయకులు ఆనందరెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు జే.క్రిష్ణమూర్తి తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..!

- కేబుల్ కోసం రోడ్డు ధ్వంసం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు



దిన్నిమీదపల్లె వద్ద రోడ్డుపై తవ్విన గొయ్యి

బి.కొత్తకోట: బి.కొత్తకోట–మదనపల్లె రహదారిలో భూగర్భ కేబుల్ పనుల కోసం రోడ్డును తవ్వి పూడ్చకుండా వదిలి వేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కేబుల్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారి పక్కన కేబుల్ వేయడానికి రోడ్డుకు అతిసమీపంలో గుంతలు తవ్వుతున్నారు. కేబుల్ వేయడానికి 5నుంచి 6ఫీట్ల లోతు తవ్వుతున్నారు. పనులు పూర్తయినా తవ్విన గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంతల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు కానీ, ప్రమాదాన్ని సూచించే రిబ్బన్లు గానీ ఏర్పాటు చేయడంలేదు. రాత్రి వేళల్లో రోడ్డుపై మట్టి కుప్పలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గాన వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయని, అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని వాహనదారులు ఆరోపించారు. అంతేకాకుండా తవ్వితీసిని మట్టిని రోడ్డు పక్కనే పోయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు పక్కనే తీసిన గోతులలో నామమాత్రంగా మట్టి పోయడంతో వర్షాలకు కుంగిపోతుంది. వాహనదారులు ఒకవేళ రోడ్డు దిగితే గుంతల్లో వాహనాలు దిగబడిపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై వేసిన మట్టి కుప్పలను తొలగించి, గుంతలను పూడ్చివేయాలని కోరారు.

చర్యలు తీసుకుంటాం

కేబుల్ కోసం రహదారికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ చెప్పారు. కాంట్రాక్టర్ నుంచి బ్యాంకు గ్యారంటీ నిధులను తీసుకున్నామని చెప్పారు. పనులు సక్రమంగా చేయకుంటే బ్యాంకు గ్యారంటీ సొమ్మును చెల్లించమని చెప్పారు.

హిందువులపై దాడులు అరికట్టాలి

పీలేరు : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలని హిందూ ఐక్యవేదిక – పీలేరు సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరు పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై దాడులుతో పాటు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలను స్మరించుకుందాం



పీలేరు : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి తదితరులు



కలికిరి (వాల్మీకిపురం) పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. స్థానిక దేవళంవీధి నుంచి ఆర్యవైశ్య భవనం వరకు ర్యాలీ చేశారు. అక్కడ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక చిత్తూరు బస్టాండులో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి గిరిధర్, సురేష్, క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు వర్ధంతి

పీలేరు : పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, అక్రంబాషా, కృష్ణమూర్తి, సుధాకర్, శ్రీరాములు, సీఆర్పీలు మురళీధర్, అశోక్, నాగరాజ పాల్గొన్నారు.

కలికిరి(వాల్మీకిపురం): మండలంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వారి చిత్రపటాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వారు పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ జాతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు రామలక్ష్మమ్మ, క్రిష్ణవేణి, గౌతమి, రేఖ, సత్యమ్మ, శోభన, బేబి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.